# భం గురువాణి

ఫిబ్రవరి 20, 2025 సంచిక - 240


## ఇచ్చేది నేర్చుకో - పుచ్చుకొనేది కాదు

కర్తవ్యాన్ని ఆచరించుటయందే నీకు అధికారము కలదు. దాని ఫలితం యందు అధికారం లేదు. కర్మఫలితములకు నీవు హేతువు కాదు, కారాదు. కర్మలను ఫలాపేక్ష లేకుండా చేయుము. ఫలితం గూర్చి నీవు ఆలోచించవద్దు. “ఇచ్చేది నేర్చుకో పుచ్చుకొనేది నేర్చుకోవద్దు.” భగవద్గీతలో గీతాచార్యులు చెప్పిన మాటలివి. మహాయోగులు, మహాత్ములంతా ఇదే చెబుతూ వచ్చినారు. వారు తమ జీవితంలో ఈ సారాంశాన్ని ఆచరణ చేసి చూపించినారు.

“ పని చేయుట యందు ఆసక్తిని చూపించు, ఫలితం గూర్చి నీవు ఆలోచన చేయవద్దు” అని వేదాంతం కూడా వివరిస్తుంది.



జీసస్ క్రైస్ట్ జీవించినన్నాళ్ళు ఆయన్ను ఎవరూ గుర్తించలేదు. కానీ స్వార్థత్యాగం చేసి, శిలువపై తన ప్రాణాన్ని త్యాగం చేసినాడు. ప్రపంచమే అతన్ని శ్లాఘించింది. దైవాంశ సంభూతుడని దేవదేవుడని కొనియాడింది.

కనుక శిష్యభక్తాదులారా! మనం చేస్తూ పోవాలి ఇస్తూ పోవాలి. తరువాత మన జీవితంలో ఎప్పుడో అద్భుతమైన మంచి పరిణామం కలుగుతుంది. పువ్వు వికసించాలి అంతే తుమ్మెదలే ఆపువ్వు దగ్గరకు వెదుక్కుంటూ వస్తాయి. దీపం వెలగాలంతే పురుగులు వాటంతటఅవే వచ్చి దాని చుట్టూ చేరుకుంటాయి. నదిలో నీళ్ళు పారాలి అంతే! ఎక్కడ నుండో వచ్చి జనాలు త్రాగుతారు. అందుచేత స్వార్థాన్ని త్యాగం చేసి, మానవసేవకు అంకితమైన మహానుభావుల్ని జగత్తు మరిచిపోదు. యుగయుగాల వరకు జ్ఞాపకం



పెట్టుకొంటుంది.

కనుక శిష్యభక్తాదులారా! మీరందరూ కూడ ఎంతో కొంత దానం ఇచ్చేది నేర్చుకోండి. లాక్కునేది నేర్చుకోవద్దండి, మీరు మీ జీవితంలో దాన రూపంలో ఇచ్చేది మిమ్మల్ని సదా కాపాడుతుంది.

